www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 26 జూన్ 2024





పొలంలో పర్యటిస్తున్న రైతు సంఘం నాయకులు

నకిలీ డి ఫారాలు వెలికి తీయాలి

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలో ఉన్న నకిలీ డి ఫారాలు వెలికి తీయాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం ఇ. రమణ, వెంకటేశు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మండలంలోని నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 40 - 159, 150 వరకు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పొలంలో అనేకమంది మండల వాసులేగాక ఇతర మండలాలకు చెందిన వారు 100 ఎకరాలలో ప్రభుత్వ భూములను కబ్జా చేసి జామాయిల్ చెట్లు, మామిడి చెట్లు, నిమ్మ చెట్లు, బినామీ పేర్లతో దొంగ డి ఫారాలు తయారు చేసుకున్నారని చెప్పారు. ఈ భూములలో మునక ప్రాంత వాసులకు పట్టాలిచ్చారని, తమభూములు ఎక్కడ ఉన్నాయా తెలియక అల్లాడిపోతున్నారు. కమలాకూరు, వలస పాలెం గ్రామాల్లో 2005లో అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 400 మందికి ప్రభుత్వం తరపున డికెటి పట్టాలు, పాసు ఇచ్చిందని, వారికీ ఎక్కడ భూమి ఉందో తెలియదని పేర్కొన్నారు. ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగినా, అడిగినా పలికే పరిస్థితి లేదని వాపోయారు. పేదలందరికీ భూములు, ఇంటి స్థలాలు ఇవ్వాలని లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో బద్వేల్ మండల రైతు సంఘం కార్యదర్శి రవిచంద్ర రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉప విద్యా శాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కడప నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయ నగర్ కాలనీ పాఠశాలలో కడప, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానో పాధ్యాయులకు కడప మండల వనరుల కేంద్ర సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆరు నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని పేర్కొన్నారు. అందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమం ఈనెల 13 నుంచి జులై 12 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఆటోమేటిక్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ, గ్రామ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సహకారంతో, సిఆర్‌పిల ప్రోత్సాహంతో ప్రతి ఒక విద్యార్థి బడి బయట ఉండకుండా బడిలో ఉండేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా, మండల క్లస్టర్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని, కమిటీల సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖ అధికారులు పాలెం నారాయణ, ఇర్షద్ అహ్మద్, సిద్ధవటం మండల విద్యాశాఖ అధికారులు విలియం రాజు, అరుణ ఒంటిమిట్ట మండల విద్యాశాఖ అధికారులు వెంకటసుబ్బయ్య, ప్రభాకర్ సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, సీఎంవో చెన్నకేశవరెడ్డి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ నరసింహారాజు పాల్గొన్నారు.

క్యాంటీన్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో క్యాంటీన్ నిర్వహణ కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ నియమావళి అనుసరించి ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తారని, ఆసక్తి గల వారు కళాశాలలోని కమిటీని సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం'
- కరపత్రాల ఆవిష్కరణలో డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' అనే కరపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఇఒ అనురాధ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ బడి అంటే చుట్టూ ఉన్న సమాజం అని, అమ్మ ప్రేమ, నాన్న భరోసా కలగలిసిన ఆటపాటల చదువుల ఒడి ప్రభుత్వ బడి అని తెలిపారు. ప్రభుత్వ బడిలో నైతిక విలువలు, చదువు, సంస్కారం, దేశభక్తి, సమానత్వ భావనలు ఏర్పడేలా విద్యాబుద్ధులు నేర్పుతారని చెప్పారు. అటువంటి బడిని ఉపాధ్యాయులు కాపాడుకొని సమాజాభివృద్ధికి అంకితం కావాలని పిలుపునిచ్చారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, ప్రభుత్వ బడిలోని సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేసి వారి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి ఊరి బడిని ఉన్నతమైన స్థితికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కామన్ స్కూల్ ద్వారా మాత్రమే చదువుతోపాటు కష్టసుఖాల్లో తోడుండే గుణం, మంచి మిత్రులను పొందడం, నీతిగా, నిజాయితీగా, మోసం చేయకుండా గౌరవంగా ఎలా బతకాలనే నేర్పరితనం అలవాడతాయని తెలిపారు. ధనిక,పేద, కుల,మత భేదాలు లేని బడి ప్రభుత్వ బడి అని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అందరూ బడిలో చదివే తల్లిదండ్రులందరికి నమ్మకం,విశ్వాసం కలిగించేలా బడిని తీర్చిదిద్దడంలో నిమగ్నం కావాలని కోరారు. విద్యార్థులు తెలుగు,ఇంగ్లీష్ రెండు భాషల్లో చదవడం, రాయడం, మాట్లాడడం నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డిఇఒ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం లోనే కాక ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలోనూ, సామాజిక సేవా దృక్పథం లోను, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కృష్ణారెడ్డి, గాజులపల్లి గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, కేదార్‌నాథ్, కరీముల్లా, సమీర్ బాషా, శివకుమార్ రాజు, వెంకటసుబ్బయ్య, యడాల సురేష్ కుమార్, సుబ్బారెడ్డి, జయం సురేష్ బాబు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డిఇఒ అనురాధ, యుటిఎఫ్ నాయకులు

మొక్కలు పీకిన వారిపై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె రెవెన్యూ పొలం చీటీ పాయిలో పేదు సాగులో ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కలు పీకిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఆధ్వర్యంలో చీటీపాయిలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పేదలు పది సంవత్సరాల నుంచి చీటీ పాయిలో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వక పోగా పేదలు భూములను సాగు చేసుకుంటుంటే అడ్డుకుంటున్నారని అన్నారు. మామిడి, చీని, మొక్కలను నాటుకున్న పేదల భూములలో చౌదరి వారి పల్లె టిడిపి నాయకులు కొంతమంది దౌర్జన్యంగా తొలగించారని పేర్కొన్నారు. వెంటనే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూ ములకు స్థానిక నిరుపేదల కుటుంబాలకు మాత్రమే అర్హులు, కానీ చీటిపాయిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపైన రెవెన్యూ యంత్రాంగం ఎటువంటి కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. పేదలు ఒక ఎకరా సాగు చేయడానికి పోతే ట్రాక్టర్లు ఆపడం పోలీసుల చేత కేసులు నమోదు చేయించడం చేస్తున్నారని ఆయన వాపోయారు. నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం మీద గంపెడ ఆశలతో ఉన్న పేదలున్నారన్నారు. మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ప్రభుత్వ భూములను కాపాడాలని, అన్యాకాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని చట్టపరంగా పేదలకు భూ పంపిణీ చేసి వలసలు నివారించే పద్ధతిలో చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుబ్బమ్మ, గోవిందు, వెంకటరామిరెడ్డి, నరసింహ, రాహుల్, అజయ్ పాల్గొన్నారు.



భూములను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధర్ గౌడ్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను జిల్లా కలెక్టర్ వి. విజయ్‌రామరాజు ఆధ్వర్యంలో శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించామని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ లోని సమావేశ మందిరంలో ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని నియోజక వర్గాల అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు, జిల్లా వ్యయ మానిటరింగ్ సిబ్బందికి ఎన్నికల ఖర్చుల వివరాల (అకౌంట్ రికన్సిలియేషన్) పై ఒకరోజు శిక్షణ డిఆర్ఒ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు 2024లో జిల్లాలో పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల అభ్యర్థులు, పార్లమెంట్ అభ్యర్థులు తమకు సంబంధించిన ఎన్నికల జమా ఖర్చుల వివరాలను జిల్లా వ్యయ మానిటింగ్ కమిటీకి సబ్మిట్ చేయాలని తెలిపారు. జిల్లాకు ఈనెల 29 నుంచి జూలై 6 వరకు రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు రానున్న నేపథ్యంలో 77 ఆర్‌పిఎ యాక్ట్1971 ఎన్నికల నియమావళి ప్రకారం పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమ జమ, ఖర్చులు వివరాలు, బిల్స్, వోచర్లు, బ్యాంక్ పుస్తకాలు సరైన క్రమంలో జులై 3 లోపల అందజేయాలని తెలిపారు. ఎన్నికల పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు రిజిస్టర్లు - ఎబిసి, అబ్స్ట్రాక్ట్ స్టేట్మెంట్స్ పార్ట్స్ -1,2,3,4, ఎక్సపెండెచర్ వివరాలు -షెడ్యూల్ 1 నుంచి 11 ఖచ్చితంగా సరిచూసుకొని అన్నింటి పైన పోటీ చేసిన అభ్యర్థి సైన్డ్ కాపీతో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల జమా ఖర్చుల వివరాలైన బిల్స్, వోచర్స్, ఎక్స్ప్లేనేటరీ నోటు అన్ని ఒరిజినల్ ఫార్మాట్‌లో సమ్మిట్ చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులే కాకుండా పోటీ చేసినా ప్రతి అభ్యర్థి ఎన్నికల అకౌంట్ ఖర్చులను చూపాలన్నారు. రూల్ 86 ప్రకారం దేని కోసం ఖర్చు చేశారు, తేదీతో సహా తెలియజేయాలని అన్నారు. నామినేషన్ తేదీ నుంచి ఎన్నికల ఫలితాల తేదీ వరకు అభ్యర్థులు బిల్లులు చెల్లించినవి,ఇంకా చెల్లించాల్సినవి కూడా ఖర్చుల వివరాల్లో పొందుపరచాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి రూల్ 90 ప్రకారం మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అభ్యర్థికి సంబంధించి ఎన్నికల ఖర్చులు రూ .40 లక్షల లోపు, పార్లమెంట్ అభ్యర్థికి సంబంధించి రూ.95లక్షల లిమిట్ ఉంటుందన్నారు. అభ్యర్థులకు వచ్చిన సోర్స్ ఆఫ్ ఫండ్ పైన ఎన్నికల జమా ఖర్చుల్లో తెలపాల్సిఉ ంటుందన్నారు. ఈనెల 27వ ఉదయం 10.30 నుంచి 5 వరకు అకౌంట్స్ రిసెప్షన్ టీం సిబ్బంది కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికల జమా ఖర్చులపై కచ్చితంగా వివరాలు తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యయ నోడల్ ఆఫీసర్ జి.నాగరాజ రావు, డిసిఒ సుభాషిణి, జిల్లా అడిట్ ఆఫీసర్ మంజుల వాణి, డిస్టిక్ కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ సురేష్ కుమార్, ఎన్నికల ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లి మచ్చలు అంటు వ్యాధి కాదు

ప్రజాశక్తి - కడప అర్బన్

బొల్లి మచ్చలు అనేవి ఒకరి నుంచి ఒకరికి సంక్రమించే అంటు వ్యాధి కాదని జిజిహెచ్ (రిమ్స్) డెర్మటాలజి విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ విటిలిగో డే (బొల్లి మచ్చ దినోత్సవం) సందర్భంగా కడప జిజిహెచ్ లోని చర్మ వ్యాధుల (డెర్మటాలజీ) విభాగంలో సంబంధిత హెచ్‌ఒడి. డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో బొల్లి మచ్చలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లి మచ్చలు వంశపారపర్యంగా వచ్చే వ్యాధి కాదని, వివాహానికి బొల్లి వ్యాధి ఎలాంటి అడ్డుకాదని వివరించారు. బొల్లి మచ్చల వల్ల ఒక వ్యక్తి శారీరక, మానసిక సౌందర్యంపై ఎలాంటి ప్రభావం ఉంటోబోదన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే చర్మవ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. తెల్ల మచ్చలు, బొల్లితో ఉన్న వారి పట్ల వివక్షతను చూపకుండా సమాజంలో అందరితో సమానంగా ఆదరించాలన్నారు. వారిని అందరితో కలివిడిగా ఉండేలా మానసిక ధైర్యాన్నిచ్చి చికిత్స చేయించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డెర్మటాలజీ విభాగం వైద్యులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నరోత్తమరెడ్డి, డాక్టర్ శిరీష, డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి, పిజి వైద్యులు, మిగతా వైదులు పాల్గొని ప్రజల్లో అవగాహన పెంపొందించారు.



మాట్లాడుతున్న డెర్మటాలజీ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ పెంచలయ్య

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్

ప్రజాశక్తి - బద్వేలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం బద్వేలులో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో పిఆర్‌సి విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.12వ పిఆర్‌సి అమలులో సైతం కమిషన్‌ను నియమించి కాలయాపన చేశారే తప్ప, విధివిధానాలను రూపొందించి అమలు చేసిన పాపాన పోలేదన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరించి, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను పూర్తిగా అడ్డుకుందని ఆరోపించారు. ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ డాక్టర్ మన్మోహన్ సింగ్ కమిషన్ బాధ్యతలకు రాజీనామా చేసినందున పిఆర్‌సి అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని తెలిపారు. జాప్యం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోకుండా తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటిచాలని కోరారు. గత ప్రభుత్వ విధానాల ఫలితంగా 11వ పిఆర్‌సిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని12వ పిఆర్‌సిలో మెరుగైన ఫిట్మెంట్ ప్రకటించాలని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించకుండా తీవ్ర వేధింపులకు గురిచేసిందని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఎన్‌డిఎ కూటమి ఇచ్చిన హామీ మేరకు 11వ పిఆర్‌సి బకాయిలు, కరువు భత్యం బకాయిలు, ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తూ వైసిపి ప్రభుత్వం అమలు చేసిన జీవో 117ను రద్దు చేస్తామని గత ఎన్నికలకు ముందు ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు పేరుతో గత ప్రభుత్వం జీవో 117 ను అమలు చేసి ప్రాథమిక విద్యకు పాడె కట్టిందని విమర్శించారు. 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలలలో విలీనం చేయడం ద్వారా వేలాదిగా ప్రాథమిక పాఠశాలలో మూతపడ్డాయని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగుమాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. బోధనకు ఆటంకం కలగజేసే వివిధ రకాల యాప్‌లను రద్దుచేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రధానోపాధ్యాయుని, వ్యాయామ ఉపాధ్యాయుని పోస్టులను మంజూరు చేయాలన్నారు. 1998, 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యమాల సందర్భంగా గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, కె.సుధాకర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టి.శివప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎన్.పవన్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సేవకుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్

గ్రామ సేవలకు సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం ఎపి గ్రామ సేవకుల సహాయకుల సంఘం సిద్ధవటం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ సేవకులు తాతల ముత్తాతల కాలం నుంచి పనిచేస్తున్నారని గుర్తు చేశారు.అలాగే ప్రతి ఎన్నికల్లోనూ గ్రామ సేవకుల పాత్ర కీలకమైందని తెలిపారు. అలాంటి వారికి ఎన్నికల్లో చాలామందికి డబ్బులు ఇవ్వలేదన్నారు. అలాగే నామినీలగా గుర్తిం చాల న్నారు. అర్హులైన వారందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని వారు కోరారు స్థాని కంగా గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పిం చారు. కొత్తగా ఎన్నికైనటువంటి ప్రభుత్వం విఆర్ఎ సమస్యలను పరిష్క రించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విఆర్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి వెంకటసుబ్బయ్య సుధాకర్ ,కిషోర్ , రమణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పిహెచ్‌డి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపిఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పిహెచ్‌డి ప్రవేశాల ప్రక్రియ రెండో రోజు మంగళవారం కొనసాగింది. మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూతోపాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల సబ్జెక్ట్ నిపుణులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య ఇంటర్వ్యూలు జరిగే తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ 26న గణితం, 27న సైకాలజీ సబ్జెక్టుకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

మాట నిలబెట్టుకున్న సిఎం

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న మన్నూర్ అక్బర్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ మేరకు రూ.3 నుంచి రూ.4 వేలు పెన్షన్లు, వికలాం గులకు రూ.6 వేలు ఇవ్వాలని మొదటి మంత్రి మండలిలో నిర్ణయం తీసు కున్నారని టిడిపి కడప జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సమీపంలోని మన్నూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 65.3 లక్షల మంది పెన్షనర్లకు సచివాలయం సిబ్బందితో పంపిణీ చేయిస్తారని తెలిపారు. ఇచ్చిన మాటప్రకారం రూ.1000 ఎప్రిల్, మే, జూన్ బకాయిలుగా పరిగణించి జులైలో రూ.7వేలు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు మాట ప్రకారం ప్రతి అవ్వకు, తాతకు టిడిపి కార్యకర్తలు, నాయకులు ఇంటి వద్దకు పోయి చెప్పారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ప్రజలు, కార్యకర్తలు తరుపున కృతజ్ఞతలు తెలిపారు. సమర్థతకు, పరిపాలనకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నిదర్శనం అని కొనియాడారు.

బిటెక్ విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వల్లూరు



చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని బి. హేమలతకు తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి ట్రస్ట్ తరపున రూ.12 వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం విద్యార్థినికి ఉపాధ్యాయులు చెక్కును అందజేశారు. ఈ సంద ర్భంగా ఉపా ధ్యాయుడు సి. వి సురేంద్ర మాట్లాడుతూ వల్లూరు మండలం లింగయ్య పల్లి గ్రామానికి చెందిన బి.హేమలత పేద కుటుంబానికి చెందిన అమ్మాయి కావడంతో ఉన్నత చదువులు చదవటానికి ఆర్థిక స్థోమత సరిగా లేనందున తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ సంప్రదించగా వారు ప్రతి సంవత్సరమూ విద్యార్థినికి కొంత మొత్తాని ఆర్థిక సాయం చేస్తున్నారు.ఈ సందర్భంగా విద్యార్థిని ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ట్రస్ట్ సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థిని పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వల్లూరు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి తరగతి విద్యార్థులను, పరిచయం చేసుకొని ఈ సంవత్సరం న్యూ జాయినింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఉపాధ్యాయిని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు లిల్లెమ్మ, పుత్త విజయా రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ అవేర్నెస్ ప్రోగ్రాం సందర్భంగా రామ రాజుపల్లిని సందర్శించారు. అక్కడి ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త లు తీసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పండ్లు, కూరగాయలు కడిగిన తర్వాతనే వాడుకోవాలని తెలిపారు. చేతుల పరిశు భ్రత గురించి ప్రజలకు తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ నిఖిత, ఆలంకాన్‌పల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది హాజరయ్యారు.

చేనేత కార్మికులకు చేయూతనివ్వండి

ప్రజాశక్తి - కడప

చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి చేయూత నివ్వాలని చేనేత జౌళి శాఖ డిసిఒ సుభారాణి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ మంజులవాణి, ఆ శాఖ జిల్లా అధికారి జి. నాగరాజరావు అన్నారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కడప నగరంలోని నేక్ నామ్ కళాక్షేత్రంలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 1 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన అమ్మకాలుంటాయని తెలిపారు. వస్త్ర ప్రదర్శనలో రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన వివిధ జిల్లాల కాటన్, పట్టు వస్త్రాలతో పాటు మెర్సిడైజ్డ్, పట్టు డై అండ్ టై చీరలు, సికో చీరలు, ధర్మవరం, గద్వాల్, ఉప్పాడ, పోచంపల్లి పట్టు చీరలు, మాధవరం, వెంకటగిరి కాటన్ చీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్, బందరు జరీ చీరలు, జమదాని చీరలు, షూటింగ్ అండ్ షర్టింగ్, కలంకారి వస్త్రాలు, పొద్దూరు ఖద్దరు, ప్రఖ్యాతిగాంచిన ఎమ్మిగనూరు బెడ్ సీట్లు, లుంగీలు డ్రెస్ మెటీరియల్స్, పేరు ఎన్నికల ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. రాష్ట్రం నుండి దాదాపు 20 చేనేత సహకార సంఘాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు. వస్త్ర ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డెవలప్మెంట్ ఆఫీసర్లు అహమ్మద్ మొయిద్దీన్, నారాయణమ్మ, కృష్ణ, అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్లు శేషగిరిరావు, రవి ప్రకాశ్ రెడ్డి, వనిత, వివర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఎంపిడిఒ రహంతుల్లయ్యా

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని ఎంపిడిఒ రహంతుల్లయ్యా పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన సూచించారు. నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్వాడీ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు ఎంఇఒ రవిశంకర్ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు వ్యవసాయం, కూలి పనులకు పంపించకుండా పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్య ఒక్కటే మార్పునకు సాధనమన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ, ఎంఇఒ-2 వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, వ్యవసాయాధికారులు

పచ్చదోమను నివారిస్తే మంచి దిగుబడి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పత్తి పంటలో పచ్చదోమ, గులాబీరంగు పురుగును నివారిస్తే మంచి దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గుడుపల్లె, బసిరెడ్డి పల్లె గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. ఉటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం కీటక ప్రధాన శాస్త్రవేత్త కే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పత్తి పంటలను పరిశీలించి పత్తిలో ఉన్న కీటకాల నివారణకు సంబంధించి ఏఏ మందులు వాడాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, నాగలక్ష్మి, ఎఒ రమాదేవి, రైతులు గంగాధర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని పుష్పగిరి మాన్యం కాలనీలో అవసరమైన ప్రదేశాల్లో నూతన విద్యుత్ స్తంభాలను మంగళవారం ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో ఆ ప్రాంత ప్రజల కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు ద్వారా ఆ ప్రాంతానికి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించినట్లయింది. గత వైసిపి ప్రభుత్వంలో నూతన విద్యుత్ స్తంభాల కోసం నాయకుల చుట్టూ పలు మార్లు తిరిగినా ఫలితం లేదని, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే, భూపేష్‌రెడ్డి కృషిని పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ సుబ్బారావు, నాయకులు మల్లు గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు, పెద్దసేట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యుడు సంతోష్‌కుమార్

మొబైల్ అతిగా చూడడం అనర్థదాయకం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మొబైల్ ఫోన్లు అతిగా చూడడం అనర్థదాయకమని నిజాం ఫిజియోథెరపీ సంస్థ వైద్యుడు సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు అధికంగా వాడడం వల్ల దుష్ప్రయోజనాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. మానవ శరీర భాగాలలోని విభాగాలకు సంబంధించి నొప్పులను ఫిజియోథెరపీ ద్వారానే నయం చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శారద, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అరవింద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి విద్యా సామగ్రి అందాలి

ప్రజాశక్తి - నిమ్మనపల్లె

ప్రభుత్వం అందిస్తున్న విద్యా సామగ్రి ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అందాలని జిల్లా ఎఎల్ఎస్‌సిఒ అధికారి చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వచ్చిన స్టూడెంట్ కిట్ పంపిణీ ప్రక్రియను ఎంఆర్‌సి భవనంలో మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎంఇఒలు పద్మావతి, నారాయణ నుంచి పాఠశాలల నిర్వహణ, విద్యా సామగ్రి పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డివారిపల్లి జడ్పి హైస్కూల్, బండ్లపై ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. మండలంలో 2963 మంది విద్యార్థులకు వచ్చిన విద్యా సామగ్రిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు వివరించారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి, బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు పద్మావతి, నారాయణ, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని మీసేవలో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కన్నా అధిక మొత్తంలో వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని డిఎల్‌డిఒ లక్ష్మిపతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మీసేవ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు మీసేవలో ప్రతి ఒక్క దానికి రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. మీసేవ లో ఇకనుంచి ప్రభుత్వం వివిధ పథకాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శి జనార్థన్, మీసేవ నిర్వాహలు సుభాహన్, రఫీ పాల్గొన్నారు.

అరటి మొలకకు రక్షణ.. ఈత మండలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అరటి పంట సంరక్షణ కోసం రైతులు సరికొత్త ప్రయోగం చేపడుతున్నారు. పంటకు రక్షణ కవచంగా థర్మాకోల్ లేదా ఈతాకులు ఉపయోగిస్తున్నారు. మొలక దశలో పంటను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు పెద్దపెద్ద చదువులు, సాంకేతిక విద్య వంటి ఉన్నత చదువులు అవసరం లేదని.. వారికి ఉన్న పరిజ్ఞానం మేరకు రైతులు వివిధ రకాల పద్ధతులను పాటిస్తూ ఆశించిన ప్రయోజనాలను సాధిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైతులు అరటి పంట రక్షణకు థర్మకోల్ లేదా ఈతాకులు ఉపయోగిస్తున్నారు. విపరీతమైన ఎండలకు అరటి పిలక ఎదగాలంటే చాలా కష్టం. అవి ఆదిలోనే చనిపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ స్థితిలో పిలక కొంత ఎదుగుదల వచ్చేవరకు ఇలా ఉపయోగించడం తప్పదని చెబుతున్నారు. పిలక దశలో ఈ పద్ధతులను అనుసరించేందుకు ఎకరాకు రూ.5వేల నుంచి రూ.8 వేల ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. అలాగే వేరుశనగ పంట రక్షణకు కూడా రైతులు సరికొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో పంట పొలాలకు అడవి జంతువుల బెడద ఎక్కువైంది. ఈ స్థితిలో పంట చుట్టూ గతంలో విద్యుత్ తీగలు వేసేవారు. అయితే అది ప్రాణాపాయం అని భావించిన రైతులు కొత్త పద్ధతులు ఎంచుకున్నారు. పొలం చుట్టూ చీరలు అమర్చుతున్నారు. దీంతో అడవి జంతువులు పంట పొలాల్లోకి రావని చెబుతున్నారు. ఇలా పంట రక్షణ కోసం రైతులు వివిధ రకాల పద్ధతులను పాటిస్తున్నారు.



అరటి మొలకకు రక్షణగా థర్మాకోల్

పులివెందుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

నియోజకవర్గంలో జరిగిన అవినీతిని తేటతెల్లం చేస్తాం : ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్/రూరల్

పులివెందుల నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి టిడిపి ఎల్లవేళలా కృషి చేస్తుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినందునే వైసిపి కార్యాలయాలను కూల్చేస్తున్నారని పేర్కొన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లకు కూడా తుపాకులు ఇచ్చారని తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో జరిగిన అవినీతిని తేల్చుతామన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాము రుణపడి ఉంటామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. వైసిపి నిర్మిస్తున్న ఆ పార్టీ కార్యాలయాలకు ఎక్కడ కూడా అనుమతులు లేవన్నారు. వాటిని రాంకీ సంస్థ యజమాని అయోధ్య రామిరెడ్డి పేరుతో నెలకు వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారని పేర్కొన్నారు. అనుమతులున్నా తమ పార్టీ కార్యాలయాలను పడగొడుతున్నారని మాజీ సిఎం జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనుమతులు ఉంటే అధికారులు ఎవరూ కూడా కారా0్యలయాలను కూల్చరని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయాలకు కూడా అనుమతులు లేవని వారు మాట్లాడటం దారుణమన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని సాధారణ ఎమ్మెల్యేగా చూడకుండా ఆయనకు భద్రత కల్పించారన్నారు. గండి క్షేత్రంలో జరిగిన అవినీతిపై విచారిస్తామన్నారు. పలువురు అధికారులు టిడిపి కార్యకర్తలను, ప్రజలను హింసించారని, వీరిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సింహాద్రిపురం ఎస్ఐ అనిల్‌కుమార్ గతంలో పులివెందులలో పనిచేస్తూ మట్కా, గుట్కా తదితర వాటిపై డబ్బులు వసూలు చేస్తూ, విలాసవంతమైన జీవితం గడిపారని తెలిపారు. ఆయనపై తానే ఫిర్యాదు చేస్తే పులివెందుల నుంచి బదిలీ చేశారని తెలిపారు. ఆయన ఇప్పుడు మళ్లీ రావడానికి పాకులాడుతున్నారని, ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. పులివెందుల ప్రాంత ప్రజలపై ఎలాంటి కోపతాపాలు లేవన్నారు. ఎవరినీ వ్యత్యాసంగా చూడబోమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

జగన్‌కు అసాధారణ భద్రత కల్పించడం సమంజసం కాదు

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 986 మంది భద్రత సిబ్బందిని నియమించడం సమంజసం కాదని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సిఎం జగన్‌రెడ్డికి తాడేపల్లి నివాసం వద్ద 934 మంది, హైదరాబాద్‌లోని లోటస్ ఫండ్ వద్ద 9 మంది, ఇడుపులపాయలో 33 మంది, పులివెందులలో 10 మందితో అసాధారణ రీతిలో భద్రత కల్పించడం సహేతుకం కాదన్నారు. జగన్ సతీమణి భారతికి నలుగురు, విజయమ్మకు ముగ్గురు భద్రత సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. గత అయిదేళ్లల్లో జగన్ భద్రత సిబ్బందిపై ప్రభుత్వం రూ.296 కోట్లు ప్రజా భారాన్ని ఖర్చు చేసినట్లు తెలిపారు. జగన్ కూడా ప్రస్తుతం ఒక సాధారణ ఎమ్మెల్యే అన్నారు. మిగతా ఎమ్మెల్యేలకు కల్పించిన విధంగానే భద్రత కల్పించాలని కోరారు. 50ఏళ్ల క్రితం నాటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ గురించి ప్రధాని మోడీ ప్రస్తావించడం శోచనీయమన్నారు. రాజ్యాంగంలోని 352 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగబద్ధంగా నాడు ఇందిరమ్మ ఎమర్జెన్సీ ప్రకటించిందని తెలిపారు. ఇందిరమ్మ ఎమర్జెన్సీ ఎత్తివేసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. ఆ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ (ఐ) 42 సీట్లుకు గానూ 41 సీట్లు గెలిచినట్లు చెప్పారు. ప్రస్తుతం మోడీ పాలనలో ఎమర్జెన్సీ నడుస్తున్నట్లు చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థలైన ఇడి, ఐటి, సిబిఐ, ఎన్ఎస్ఏ, ఎలక్షన్ కమిషన్ నిర్వీర్యం అయినట్లు చెప్పారు. మోడీకి చిత్తశుద్ధి ఉంటే అప్రకటిత ఎమర్జెన్సీ నుంచి దేశాన్ని విముక్తి చేయాలని తులసిరెడ్డి కోరారు.

సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నీట్ పరీక్ష-2024 ఫలితాలు, పరీక్ష నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులు నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున ఆ పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ప్రొద్దుటూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దేశం మొత్తం నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై స్పందిస్తుంటే.. రాష్ట్రంలో దానికి భిన్నంగా అధికార టిడివి, జనసేన, వైసిపి ఏమాత్రం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. నీట్ పరీక్ష నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. నీట్ పరీక్ష రద్దు చేసి అక్రమాలకు పాల్పడ్డ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

చిలంకూరు పంచాయతీ అవకతవకలపై విచారణ



అవకతవకలపై విచారిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

చిలమకూరు పంచాయతీ అవకతవకలపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారుల బృందం మంగళవారం క్షేత్రస్థాయి విచారణను చేపట్టింది. జమ్మలమడుగు, కడప డిఎల్‌పిఓలు విజయభాస్కర్, మస్తాన్ వల్లి, రాజుపాలెం, బి.కోడూరు విఆర్‌డిలు షాకీర్ అలీ ఖాన్, హరికృష్ణ యాదవ్ చిలంకూరు పంచాయతీ కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించిన నేపథ్యంలో వారు విచారణకు శ్రీకారం చుట్టారు. పంచాయతీలోని నిధుల దుర్వినియోగం, అవకతవకల పనులపై అధికారులు విచారించారు. పంచాయతీ పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ పంచాయతీలో పనిచేస్తున్న స్వీపర్‌తో పనిచేయిస్తూ, వైసిపి నాయకుడి వలె అప్పటి ప్రజాప్రతినిధితో సఖ్యతగా వ్యవహరించే వారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై వైసిపి ప్రభుత్వంలో ఎంపిటిసి సభ్యులు నవీన్ కుమార్ పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదు. తాజాగా ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి జోక్యంతో విచారణ సాగుతోంది. విచారణలో సదరు స్వీపర్ తానే పంపు ఆపరేటర్‌గా 16ఏళ్లుగా వ్యవహరిస్తున్నట్లు అధికారుల ఎదుట అంగీకరించినట్లు సమాచారం. విచారణ నివేదికలను పంచాయతీరాజ్ శాఖ అధికారులకు అందిస్తామని విచారణ కమిటీ అధికారులు తెలిపారు. పంచాయతీలో అవకతవకలకు సంబంధించి నగదు మొత్తాన్ని తిరిగి పంచాయతీ ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని, విచారణ అధికారులను ఎంపీటీసీ నవీన్ కుమార్ కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బాల అంకిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, సత్యం, ఈశ్వరయ్య, మహేష్ పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సు పట్టని మార్కెట్ యార్డులు

ప్రజాశక్తి - చాపాడు

వ్యవసాయ మార్కెటింగ్ శాఖను రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే రానురానూ అవి రైతు శ్రేయస్సును పూర్తిగా విస్మరిస్తున్నాయి. సంక్షేమ పథకాలను రైతుల కోసం ఏర్పాటు చేయడం, వాటిని వారికి తెలియజేయడం, ధాన్యం ధరలు తెలియజేయడం, ధరలు వచ్చేంతవరకు దాన్యం నిల్వ ఉంచుకునేలా చర్యలు చేపట్టడం చేయాలి. అలాగే గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా తమ ఉత్పత్తులను అమ్ముకునే ఏర్పాట్లతోపాటు పలు రైతు సంక్షేమ కార్యక్రమాలను మార్కెట్ యార్డులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ధాన్యం నిల్వ ఉంచే యార్డులుగా మాత్రమే అవి తయారయ్యాయి. గతంలో మార్కెట్ యార్డ్ తరపున పశు వైద్య సదుపాయం లేని గ్రామాలను ఎంచుకొని ప్రతి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో సంవత్సరానికి నాలుగు శిబిరాలు ఏర్పాటు చేయించేవారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేసి పాడి రైతులను ప్రోత్సహించేది. ఈ అవకాశాన్ని గత మూడు సంవత్సరాలుగా పూర్తిగా కనిపించడంలేదు. రైతు బీమా పథకం ద్వారా రైతులకు బీమా సౌకర్యం కల్పించేది. మార్కెట్ యార్డులు రైతులకు పథకాలపై అవగాహన కూడా కల్పించడం లేదు. రైతు బంధు పథకం ద్వారా తక్కువ వడ్డీతో రైతు పండించిన పంటలకు బీమా సౌకర్యం కల్పించేది. పంటల కనీస మద్దతు ధరలు సూచించే సూచిక బోర్డులు కార్యాలయానికే పరిమితం కావడంతో రైతులకు ఏమాత్రం ఉపయోగం పడడంలేదు. మార్కెట్ యార్డ్ ఉన్నతాధికారులు స్పందించి రైతులకు కలుగు ప్రయోజనాలపై అవగాహన కల్పించి, పథకాలను రైతులకు చేర్చితే ఉపయోగకరంగా ఉంటుంది.



వరి ధాన్యం అమ్మకాలు చేస్తున్న రైతులు (ఫైల్‌ఫోటో)



మాట్లాడుతున్న నాగరాజు, నాయకులు

ప్రవీణ్‌రెడ్డి.. రాష్ట్ర నాయకులు అంతా గమనిస్తున్నారు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇటీవల జరిగిన ఎన్నికల్లో నువ్వు ఏ పార్టీకి పనిచేశావో, నీ వర్గంలోని అందరిని ఎందుకు వైసిపిలోకి పంపించావో టిడిపి రాష్ట్ర నాయకులు అంగా గమనిస్తున్నారని టిడిపి నాయకుడు నల్లబోతుల నాగరాజు, మాజీ హౌసింగ్ బోర్డ్ మెంబర్ కామిశెట్టి బాబు, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, సత్యనారాయణ, సుంకర మురళి, బాబు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల జరిగి నెల కూడా కాలేదు.. ఇప్పుడే తానే ఇన్‌ఛార్జి అయినట్లు అధికారంతో అందరిని బెదిరిస్తూ మాట్లాడడం మంచిది కాదన్నారు. గతంలో జరిగిన అన్ని సర్వేల్లో పెద్దాయన పేరే ఎక్కువగా రావడంతో ఆయనకు టికెట్ ఇచ్చారని, ప్రజలు కూడా వరదరాజులరెడ్డికే మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించారన్నారు. టికెట్టు రాలేదని కక్షతో మీ వర్గాన్ని వైసిపిలో చేర్పించావన్నారు. ఎన్నికల్లో కూడా వైసిపికి ఓట్లు వేయాలని ప్రజల అందరికీ చెప్పి వేయించావన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి టిడిపిలో ఎప్పటికీ మంచి ఆదరణ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ కూడా కక్ష సాధింపు చర్యలు ఏవీ వద్దని ఎక్కువగా ఎవరూ మాట్లాడవద్దని తెలిపారని పేర్కొన్నారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందని నువ్వు కూడా ప్రచారం చేశావన్నారు. అందుకు తగ్గ ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. పార్టీ కోసం ప్రతి ఒక్క కార్యకర్త పనిచేశారన్నారు. నీవు పార్టీ కోసం ఏం చేశావో చెప్పాలన్నారు. అధికారులపై ఇలాంటి బెదిరింపులు పనికిరావన్నారు. నీ మీద పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రొద్దుటూరులో తెలుగుదేశం పార్టీని నష్టపరచకుండా ప్రజలందరికీ సేవ చేసేలా ఉండాలన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

శుభ్రత పాటిస్తే మలేరియా దూరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే మలేరియా వ్యాధి దూరమవుతుందని వైయంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఆశా తమ పరిధిలో పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాదు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటి పరసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల గురించి తమకు సమాచారం అందిస్తే ఆయిల్‌బాల్స్ వేయిస్తామన్నారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సల్మాన్ రాజ్

అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో సభా భవనంలో పంచాయతీ సెక్రటరీలు, వైద్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచడంతోపాటు మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసు కోవాలన్నారు. తాగునీటికి సంబంధించిన పైపులైన్ ఎక్కడైనా మరమ్మతులు ఉంటే వెంటనే వాటి పనులు చేయాలని ఆదేశించారు. శానిటేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి పద్మనాభరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి

సింహాద్రిపురం : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో క్షేత్రస్థాయిలోనే రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఎఒ శివ మోహన్ రెడ్డి సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆర్బికే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలకు సంబంధించి నివేదికలను అందించాలన్నారు.